క్లుప్తంగా

ఇన్‌చార్జ్ ఎంపీపీగా వెంకటరామిరెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకటరామిరెడ్డి

పెద్దపప్పూరు: బొందలదిన్నె వెంకటరామిరెడ్డి (రామయ్య) బుధవారం ఎంపీడీఓ రామకృష్ణ సమక్షంలో ఇన్‌చార్జ్ ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించారు. గత నెలలో ఎంపీపీ రామ్మూర్తి రెడ్డి అనారోగ్య కారణాలతో తన పదవికి రాజీనామా చేశారు. దీంతో జిల్లా అధికారులు ఇన్‌చార్జ్ ఎంపీపీ బాధ్యతలను రామిరెడ్డికి అప్పగించాలని మూడురోజుల క్రితం ఉత్తర్వులు జారీచేశారు. ఈసందర్భంగా ఇన్‌చార్జ్ ఎంపీపీకి అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు.

సంక్షేమ పథకాలు అందించాలి

గుత్తి రూరల్: తమకు సంక్షేమ పథకాలు అందించాలని గౌతమిపురి ఎలక్ట్రీషియన్, మోటార్ వర్కర్స్ సొసైటీ సభ్యులు కోరారు. బుధవారం పట్టణంలోని కార్యాలయంలో తహసీల్దార్ మహబూబ్‌బాషాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ మండల అధ్యక్ష, కార్యదర్శులు నారాయణస్వామి, ప్రభాకర్ మాట్లాడుతూ మండలంలో ఎలక్ట్రీషియన్ వృత్తితో వంద మందికి పైగా జీవిస్తున్నామన్నారు. చాలా మందికి రేషన్ కార్డులు లేవని అన్నారు. సొసైటీ సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు స్థలం కేటాయించి పక్కా భవనాలు నిర్మించాలన్నారు. సొసైటీ సభ్యులు కన్నా, సతీష్, రాణా పాల్గొన్నారు.

ఆలూరుకు సన్మానం



ఆలూరు సాంబశివారెడ్డిని సన్మానిస్తున్న మార్కెట్‌యార్డ్ పాలక వర్గం

శింగనమల: శింగనమల మార్కెట్‌యార్డ్ కమిటీ సభ్యులు బుధవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డిని సన్మానించారు. మార్కెట్ యార్డ్ నూతన కమిటీని ఎంపిక చేసినందుకు మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ భూమిరెడ్డి, వైస్ చైర్‌పర్సన్ మూడ్ గీత, కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ యార్డ్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

నార్పల: పులసలనూతల గ్రామంలో గురువారం సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈమేరకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ రఘునాథ్‌రెడ్డి ,అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

మట్కాబీటర్ల అరెస్ట్



స్వాధీనం చేసుకున్న నగదుతో సీఐ, సిబ్బంది

గుంతకల్లుటౌన్: పట్టణానికి చెందిన ముగ్గురు మట్కాబీటర్లను బుధవారం వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.1.15 లక్షల నగదు, మట్కాపట్టీలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రామసుబ్బయ్య తెలిపారు. హనుమాన్‌సర్కిల్ వద్ద మట్కా నిర్వహిస్తున్న ముగ్గురు బీటర్లు జేపీ రామచంద్రప్ప, ఓడ్లపల్లి రవి, పాదిలిబాబును అరెస్ట్ చేశామన్నారు. దాడుల్లో ఎస్ఐ మురహరి, సిబ్బంది పాల్గొన్నారు.

టీబీ,లెప్రసీ సర్వేపై సమీక్ష

గుత్తి:పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో బుధవారం టీబీ యూనిట్‌లో డాక్టర్ అనుపమ టీబీ, లెప్రసీ ఎల్‌సీడీసీ సర్వేను సమీక్షించారు. సర్వే రిపోర్టులు పకడ్బందీగా ఉండాలని టీబీ యూనిట్ టీం సభ్యులను ఆమె ఆదేశించారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

గార్లదిన్నె: అంకితభావంతో పనిచేస్తే ఉపాధ్యాయులకు గుర్తింపు ఉంటుందని ఎంపీపీ వెంకటనారాయణ పేర్కొన్నారు. బుధవారం కొప్పలకొండ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేసి బదిలీపై వెళ్లిన లక్ష్మణనాయుడు, సత్యనారాయణ, రవికుమార్ ,హరీష్ బాబును ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వక్తలు ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. హెచ్ఎం గోవిందరెడ్డి, ఉపాధ్యాయులు పరమేశ్వర్‌రెడ్డి, పర్వతయ్య, అనిల్‌కు మార్, సీఆర్పీ వెంకటరాముడు పాల్గొన్నారు.

ప్రజలతో మమేకమై..

పెద్దవడుగూరు: కరోనా సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ ప్రజలకు అండగా నిలిచింది. రాష్ట్రంలో కోవిడ్ కేసులు పెరుగుతున్న తరుణంలో వలంటీర్లు ప్రాణాలకు తెగించి మరీ సేవలను అందించారు. రాంపురం గ్రామానికి చెందిన వలంటర్ దస్తగిరి ప్రజలతో మమేకమై సేవలు అందించాడు. కోవిడ్ సమయంలో గ్రామంలో ఇంటింటికీ వెళ్లి నిత్యావసర సరుకులు అందించడంతోపాటు కోవిడ్ నివారణ చర్యలు చేపట్టాడు. ఫీవర్ సర్వేలు చేస్తూ వైద్య సిబ్బందికి సహకరించాడు. దస్తగిరి అందించిన సేవలు గుర్తించిన అధికారులు సేవారత్న అవార్డు ప్రదానం చేశారు.



కోవిడ్ సమయంలో గ్రామవీధిలో వేస్ట్ ఆయిల్ చల్లుతున్న వలంటీర్ దస్తగిరి

అండగా నిలిచాడు

మా కుటుంబానికి కోవిడ్ సోకిందని ఇంటిలోనే ఉంచారు. ఇంటి సమీపంలోకి ఎవరూ వచ్చే వారు కాదు. ఆ సమయంలో వలంటీర్ దస్తగిరి ఇంటి వద్దకు వచ్చి బాగోగులు చూసుకునేవాడు. ఎలాంటి భయాందోళనకు గురి కాకుండా ఉండాలని మాలో ధైర్యం నింపాడు. నిత్యావసర వస్తువులు, శానిటైజర్లు అందించాడు. వలంటీర్ లేకుంటే మేము చాలా ఇబ్బందులు పడేవాళ్లం. –లక్ష్మీదేవి, రాంపురం



థ్యాంక్యూ సీఎం సార్..





సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న గుంతకల్లు డీఎం నారాయణస్వామి, తాడిపత్రిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

తాడిపత్రి అర్బన్: తమకు హయ్యర్ పెన్షన్ స్కీమ్‌ను వర్తింపజేయడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆర్టీసీ ఉద్యోగులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. బుధవారం స్థానిక ఆర్టీసీ గ్యారేజీలో ఉద్యోగులు, డ్రైవర్లు, కండెక్టర్లు, గ్యారేజీలో ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్టీసీ డీఎం శంకర్ మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడం వలన ఉద్యోగ భద్రతతో పాటు అనేక సదుపాయాలను కల్పించిందన్నారు. ఇచ్చిన హామీని నిలబట్టుకున్న ఏకైక సీఎం వైఎస్ జగన్ అని కొనియాడారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డీఎం నందిని, ఏఎం(ఈ) సత్యనారాయణ, సూపర్‌వైజర్లు, ఆర్టీసీ గ్యారేజీ కార్మికులు, యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

గుత్తి: హయ్యర్ పెన్షన్ విధానంలోకి ఆర్టీసీ ఉద్యోగులను తీసుకొంస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేయడంతో గుత్తిలో ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు బుధవారం సీఎం వైఎస్ జగన్ చిత్ర పటానికి క్షీరాషేకం చేశారు. ఆర్టీసీ డిపోలో హెడ్ క్లర్క్ శ్రీపాద, ఎస్టీఐ రమణమ్మ, గ్యారేజీ ఇన్‌చార్జ్ శివప్ప, సీసీఎస్ డెలిగేట్ పీకే రాముడు, ఎంప్లాయీస్ యూనియన్ సెక్రెటరీ గంగేశ్వర్, ఎన్ఎంయూ సెక్రటరీ ఎన్వీ రాముడు, మధు, శ్రీనివాసులు సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన , ఇవ్వని హామీలను సైతం సీఎం అమలు చేశారని ప్రశంసించారు. జీవితాంతం సీఎం జగన్‌కు రుణపడి ఉంటామన్నారు.

గుంతకల్లుటౌన్: ఆర్టీసీ ఉద్యోగులకు అధిక(హయ్యర్)పెన్షన్ విధానాన్ని వర్తింపుజేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం స్థానిక ఆర్టీసీ డిపోలో సీఎం చిత్రపటానికి ఆర్టీసీ డీఎం నారాయణస్వామి, ఉద్యోగులు క్షీరాభిషేకం చేసి జేజేలు పలికారు. అధిక పెన్షన్ విధానం వల్ల ఉద్యోగుల పింఛన్ ఐదారు రెట్లు పెరుగుతుండటం చాలా సంతోషం కలిగిస్తుందన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలోకి విలీనం చేయడమే కాకుండా ఉద్యోగుల కొన్నేళ్ల నాటి న్యాయమైన డిమాండ్‌ను నెరవేర్చడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో డిపో సూపర్‌వైజర్లు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం



వన్నేదొడ్డిలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి

• ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి

గుత్తి రూరల్: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం వన్నేదొడ్డి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఎద్దుల బండిలో ఊరేగించి భారీ క్రేన్ సాయంతో పూలు చల్లి, ఎమ్మెల్యే వైవీఆర్‌కు గజమాల వేశారు. అనంతరం ఎమ్మెల్యే గ్రామంలో ప్రతి గడప వద్దకూ వెళ్లి నాలుగేళ్లలో ప్రజలకు అందిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ కులమత, రాజకీయాలకు అతీతంగా పాలన సాగిస్తుంటే ప్రతిపక్షాలు లేనిపోని అభాండాలు వేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రతి కుటుంబానికి మేలు జరిగిందన్నారు. సంక్షేమ లబ్ధి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే జమ చేస్తున్నామన్నారు. వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ ద్వారా పాలనను గ్రామాల చెంతకే తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. రెండు వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలుస్తూ సీఎం జగన్‌కు మంచి పేరు వస్తుండటాన్ని సహించలేని చంద్రబాబు, పవన్ వారిపై తమ అక్కసు వెళ్లగక్కుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి జగనన్నను సీఎం చేసుకుందామని పిలుపునిచ్చారు. ఆయా గ్రామాల్లో ప్రజలు నుంచి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. మునిసిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి, సర్పంచ్ బేడల లక్ష్మీదేవి, మార్కెట్ యార్డు చైర్ పర్సన్ సునీలా యాదవ్, స్థానిక నాయకులు బేడల వెంకట్రాముడు, బేడల రమేష్, నారాయణస్వామి, బళ్లారి రాజ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కోనా మురళీధర్ రెడ్డి, ఎంపీటీసీ చిన్న వీరన్న గౌడ్, స్టోర్ డీలర్ కె.మల్లికార్జున, రంగస్వామి, రామచంద్ర యాదవ్, వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, సచివాలయ రూరల్ కన్వీనర్ సుభాష్‌రెడ్డి, నాయకులు మల్లయ్య యాదవ్, క్రషర్ మధు, గురుప్రసాద్ యాదవ్, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

గుంతకల్లుటౌన్: సైబర్ మోసాల పట్ల విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని మహిళా కానిస్టేబుళ్లు వనజ, మీనా పేర్కొన్నారు. బుధవారం శ్రీసాయి మహిళా డిగ్రీ కళాశాలలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, సైబర్‌మోసాలపై విద్యార్థినులకు అవగాహన సదస్సును నిర్వహించారు. హెడ్‌కానిస్టేబుల్ రమేష్, శ్రీసాయి కరస్పాండెంట్ ప్రభాకర్, పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వైఎస్సార్ కంటి వెలుగు శిబిరం

పామిడి: స్థానిక కమ్యూనిటీ ఆసుపత్రిలో బుధవారం వైఎస్సార్ కంటి వెలుగు శిబిరం నిర్వహించారు. మాల్వినా కంటిఆసుపత్రి వైద్యులు 102 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 25 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశారని వైద్యాధికారి ఎల్లప్ప తెలిపారు. అప్తాలమిక్ అసిస్టెంట్ విశాల, హెడ్‌నర్స్ శివకుమారి, సుధీర్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గార్లదిన్నె: కనంపల్లి క్రాస్ సమీపంలో 44వ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. 108 సిబ్బంది తెలిపిన వివరాలు.. శింగనమల మండలం చిన్న జలాలపురానికి చెందిన జగదీశ్వర్ రెడ్డి బైక్‌పై కనంపల్లి క్రాస్ సమీపంలో రోడ్డు దాటుతుండగా గుత్తి వైపు నుంచి వచ్చే ఇన్నోవా వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని 108లో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

లింగ నిర్ధారణ చేస్తే జైలుకే

యల్లనూరు: లింగ నిర్ధారణ చేస్తే జైలుశిక్ష తప్పదని డాక్టర్ సాయినాగశ్రీ పేర్కొన్నారు. కల్లూరు సచివాలయం వద్ద బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ పీసీ పీఎన్‌డీటీ చట్ట ప్రకారం లింగ నిర్ధారణ చేయడం నేరమన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో వీరనారాయణ, సీహెచ్‌ఓ సుప్రియ, పంచాయతీ కార్యదర్శి చంద్రదీప్, ఏఎన్ఎం పద్మావతి, ఆశా వర్కర్ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

బుక్కరాయసముద్రం: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు సీఐ నాగార్జున రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ముసలమ్మ కట్ట, వడియంపేటలోని జాతీయ రహదారి వద్ద హెచ్‌పీ గ్యాస్ సహకారంతో ప్రమాద సూచికలు ఏర్పాటు చేసి ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

గుత్తి: పట్టణంలోని ఎల్ఎం బాలుర పాఠశాలలో బుధవారం గుత్తి మండల ఏపీటీఎఫ్ కమిటీని ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా లక్ష్మణ్ నాయుడు, ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ బాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర సెక్రటరీ నరసింహులు, గౌరవాధ్యక్షుడు ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజ్, జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, నాగరాజు, జిల్లా ఆడిట్ కన్వీనర్ రామచంద్ర పాల్గొన్నారు.

డ్రైల్యాండ్ హార్టికల్చర్ పనులు ప్రారంభించండి

యల్లనూరు: మండలవ్యాప్తంగా డ్రైల్యాండ్ హార్టికల్చర్ పనులు ప్రారంభించాలని ఏపీడీ వెంకటరత్నం ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన ఏపీఓ షబ్బీర్‌బాషాతోపాటు సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో పండ్లమొక్కల పెంపకం పనులతో పాటు కూలీల హాజరు శాతం పెంచాలన్నారు.

వైద్య సేవలు సక్రమంగా అందించాలి

శింగనమల: ప్రజలకు వైద్య సేవలు సక్రమంగా అందించాలని టీబీ, లెప్రసీ జిల్లా నియంత్రణ అధికారి డాక్టర్ అనుపమా జేమ్స్ సిబ్బందికి సూచించారు. బుధవారం రఘునాథపురంలో వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఓపీ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ప్రజలతో వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. తరిమెల పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఫిర్దోస్, హెచ్‌ఈఓ సత్యనారాయణ, నాగన్న, సూపర్‌వైజర్ పాల్గొన్నారు.

ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక దృష్టి



పోలీస్ పికెట్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ గంగయ్య

పెద్దవడుగూరు : మండలంలోని ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు డీఎస్పీ సీఎం గంగయ్య పేర్కొన్నారు. బుధవారం ఆయన అప్పేచర్లలో పర్యటించారు. గ్రామంలోని వీధుల్లో తిరుగుతూ ప్రజలతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గొడవల జోలికెళ్లకుండా కలిసిమెలిసి జీవించాలని సూచించారు. అనంతరం గ్రామంలోని పోలీసు పికెట్ పరిశీలించారు.

కేజీబీవీ ప్రత్యేకాధికారిగా ఉష

పెద్దవడుగూరు : స్థానిక కేజీబీవీ ప్రత్యేకాధికారిగా ఉష బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె శెట్టూరు కేజీబీవీ మాథ్స్ సీఆర్‌టీగా పని చేస్తున్న ఈమె పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయుల సహకారంతో విద్యాభివృద్ధికి కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు.

అట్టహాసంగా సీసీ రోడ్ల ప్రారంభం

పామిడి: మండల కేంద్రంలో బుధవారం సీసీరోడ్ల ప్రారంభం అట్టహాసంగా జరిగింది. గుప్తాకాలనీలో రూ.1.9 కోట్లు, నెహ్రూకాలనీలో రూ.2.2 కోట్లు, వీకే ఆదినారాయణరెడ్డి కాలనీలో రూ.52 లక్షలతో నిర్మించిన సీసీరోడ్లు, డ్రైనేజీలను కలెక్టర్ ఎం గౌతమి, ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ప్రారంభించారు. అనంతరం నాడు–నేడు కింద రూ.5.81 కోట్లతో నిర్మిస్తున్న పామిడి కమ్యూనిటీ ఆసుపత్రి భవనాన్ని పరిశీలించారు. వైద్యసేవలపై ఆసుపత్రి వైద్యాధికారి ఎల్లప్పను అడిగి తెలుసుకున్నారు. పామిడిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఐటీఐ, బ్లడ్ బ్యాంకు ఏర్పాటు చేయాలని, టెక్స్‌టైల్ పార్కును పునరుద్ధరించాలని పామిడి అభివృద్ధి కమిటీ సభ్యులు కలెక్టర్, ఎమ్మెల్యేను కోరారు. స్థానిక సీఎస్ఐ చర్చి పడమటి గేటు వైపు సీసీరోడ్డు వేయాలంటూ సీఎస్ఐ చర్చి సభ్యులు అర్జీ అందజేశారు. ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ ఎం లిఖిత, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్కలూరు దిలీప్‌రెడ్డి, మండల ఇన్‌చార్జ్ జానకిరామిరెడ్డి, మండల కన్వీనర్ కే నారాయణరెడ్డి, కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూదన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ బీ రుక్మాన్, బీ ఆసిఫ్, బోయ రామచంద్ర, ఆర్‌సీ వెంకట్రామిరెడ్డి, చెన్నకేశవరెడ్డి, పార్వతీశ్వర్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, కాయల మహేష్, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్ల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్, కలెక్టర్ గౌతమి

కలెక్టర్‌కు ఎమ్మెల్యే మెమొరాండం

పామిడిలోని పనులు అభివృద్ధి పనులకు సంబంధించిన మెమొరాండంను ఈసందర్భంగా ఎమ్మెల్యే వైవీఆర్ కలెక్టర్ గౌతమికి అందజేశారు. కాలువల పునరుద్ధరణ, సీసీరోడ్లు, డ్రైనేజీల ఏర్పాటు, ఉపాధి పనుల కల్పన, ఏడు సచివాలయాల కొనసాగింపు వంటి 17 అంశాలను పరిశీలించాలని ఎమ్మెల్యే కలెక్టర్‌ను కోరారు.

సాంకేతిక పరిజ్ఞానం చాలా అవసరం : డీఆర్ఎం

గుంతకల్లు: ఆధునిక పోటీ ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడం చాలా అవసరమని విద్యార్థులకు డీఆర్ఎం కె.వెంకటరమణారెడ్డి సూచించారు. సౌత్ సెంట్రల్ రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనేజేషన్ (ఎస్‌సీఆర్‌డబ్ల్యూడబ్ల్యూ) గుంతకల్లు డివిజన్ సహకారంతో రైల్వే హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన బైజూస్ క్లాస్‌లను బుధవారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ఈ ఏడాది హైస్కూల్ చేరిన నూతన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఫ్రెషర్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పదో తరగతి పరీక్షల్లో స్కూల్ టాపర్‌గా నిలిచిన రుతిక, ఉదయ్ కుమార్, ప్రణవ్‌కు డీఆర్ఎం నగదు బహుమతులు అందజేశారు. అలాగే ఇండియన్ టాలెంట్ ఒలంపియాడ్‌లో స్టేట్ ర్యాంకు సాధించిన విద్యార్థులు కె.అజయ్‌కుమార్, ఎస్.మహబుబ్‌బాషా, ఉదిత్‌కూ నగదు పురస్కారాలు అందజేశారు. గత ఏడాది అకాడమిక్ ఇయర్‌లో జోనల్ లెవల్ ఉత్తమ పాఠశాలగా గోల్డ్ మోడల్ (రైల్వే ఇంగ్లీష్ మీడీయం హైస్కూల్)తో పాటు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రిన్సిపాల్‌గా ఎంపికైనా మధుసూదన్‌రావును అభినందిచారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సూర్యనారాయణ, ఎస్‌సీఆర్‌డబ్ల్యూడబ్ల్యూ గుంతకల్లు డివిజన్ అధ్యక్షురాలు రూప, సీనియర్ డీపీఓ జయశంకర్ చౌహాన్ పాల్గొన్నారు.



బైజూస్ క్లాస్‌ను ప్రారంభిస్తున్న డీఆర్ఎం వెంకటరమణారెడ్డి, ఆయన సతీమణి రూప

జగనన్న సురక్ష..సామాన్యులకు రక్ష

గుంతకల్లుటౌన్: జగనన్న సురక్ష కార్యక్రమం సామాన్య ప్రజలకు రక్షణగా నిలుస్తోందని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మైమూన్, కమిషనర్ వి.మల్లికార్జున తెలిపారు. బుధవారం పట్టణంలోని 10వ వార్డు సచివాలయంలో కౌన్సిలర్ సీలావతి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అలాగే పట్టణంలోని 37వ వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజలకు సర్టిఫికేట్లను ఉచితంగా పంపిణీ చేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్లు రామలింగప్ప, జింకల రామాంజినేయులు, మెప్మా టీపీఆర్ఓ మోహన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఆర్ఐ ఎర్రిస్వామి, మెప్మా సీఎంఎం భవానీ, 37వ వార్డు ఇన్‌చార్జ్ పరుశురామప్ప, సచివాలయాల కన్వీనర్ ఖలీల్, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: చెర్లోపల్లి సచివాలయంలో బుధవారం ఎంపీడీఓ రామకృష్ణ,ఈఓఆర్డీ కమలాబాయి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. దాదాపు 770 మందికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ధురవపత్రం అందిస్తున్న వైస్ చైర్‌పర్సన్ మైమూన్

యల్లనూరు: కల్లూరు గ్రామ సచివాలయం వద్ద బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సర్పంచ నాగేంద్ర, డిప్యూటీ తహసీల్దారు శ్వేత ఆధ్వర్యంలో జరిగింది. ప్రజలకు సర్టిపికెట్లను అందజేశారు. వైఎస్సార్‌సీపీ నేత సూరి, అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్: పాతకొత్తచెరువు, దంచర్లలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టారు. ఎంపీడీఓ వెంకటరమణప్ప ఆయా గ్రామాల్లో 690 మందికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. సర్పంచ్‌లు మజ్జిగ మల్లికార్జున, నారాయణస్వామి, ఎంపీటీసీలు వెంకటరెడ్డి, కొట్టం పరశురాముడు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు



హమీద్‌ఖాన్, సీఐ

తాడిపత్రి అర్బన్: శాంతి భద్రతల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని తాడిపత్రి అర్బన్ సీఐ హమీద్‌ఖాన్ స్పష్టం చేశారు. బుదవారం అర్బన్ సీఐగా బాధ్యతలు చేపట్టిన ఆయన మీడియాతో మాట్లాడారు. పట్టణంలో శాంతిభద్రతలు అదుపులోనే ఉన్నాయన్నారు. పట్టణంలోని ప్రశాంత జీవనానికి భంగం కల్గిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదన్నారు. తాడిపత్రిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారు ఎవరైనా ఉంటే ఇక తట్టా బుట్టా సర్దుకోవాల్సిందేనన్నారు. మట్కా, గ్యాంబ్లింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టడమేగాకుండా వాటిని ప్రోత్సహిస్తున్న వారిపై నిఘా ఉంచుతామన్నారు. ఎవరైనా సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలను పోస్టింగ్ చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని సీఐ హెచ్చరించారు.

మెటల్ స్టోన్ క్రషర్లు తొలగించండి

గుత్తి రూరల్: జక్కలచెరువు గ్రామంలో పంట పొలాల మధ్య ఉన్న మెటల్ స్టోన్ క్రషర్లను తొలగించాలని శ్రీ గౌతమిపురి దివ్యాంగుల మండల సమాఖ్య సభ్యులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. బుధవారం పట్టణంలోని స్థానిక కార్యాలయంలో తహసీల్దార్ మహబూబ్ బాషాకు దివ్యాంగుల సమాఖ్య నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దివ్యాంగుల సమాఖ్య నాయకుడు రామతీర్థం మాట్లాడుతూ జక్కలచెరువు గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 563లో తనకు 3.53 ఎకరాల భూమి ఉందన్నారు. తన పొలం పక్కలో తిరుమల రెడ్డి, పరమేశ్వరరెడ్డి, రాజమోహన్‌రెడ్డికి చెందిన మూడు క్రషర్లు ఉన్నాయన్నారు. క్రషర్ల నుంచి రోజు దుమ్ము, ధూళి, కంకర రాళ్లు పడుతుండటంతో పంటల సాగుకు ఇబ్బందిగా ఉందన్నారు. దివ్యాంగుల సమాఖ్య నాయకులు శ్రీనివాసులు, దత్తాత్రేయ, వెంకటేష్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఘర్షణపై కేసు నమోదు

పుట్లూరు: మండలకేంద్రంలో మంగళవారం రాత్రి జరిగిన ఘర్షణపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జ్ ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. మురుగునీటి కాలువ విషయంలో జరిగిన ఘర్షణలో రామాచారి, యజ్ఞాచారికి గాయాలయ్యాయన్నారు. బాధితుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

జిల్లా జట్టులో చోటు

తాడిపత్రి: పట్టణానికి చెందిన క్రీడాకారిణి అండర్– 19 జిల్లా స్థాయి జట్టుకు ఎంపికైనట్లు ఆర్డీటీ కోచ్ భార్గవ్ తెలిపారు. వారం రోజులుగా విద్యార్థినులకు ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నీలో పలు జట్లు పాల్గొన్నాయని, ఇందులో తాడిపత్రి శ్రీ సాయి చైతన్య పాఠశాల విద్యార్థిని సుహాన అద్భుత ప్రదర్శన చూపడంతో నిర్వాహకులు అండర్ – 19 జట్టుకు ఎంపిక చేశారన్నారు. మంగళగిరిలో జరిగే క్రికెట్ పోటీల్లో పాల్గొంటుందన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

బుక్కరాయసముద్రం: జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని స్పెషలాఫీసర్ శ్రీదేవి లబ్ధిదారులకు సూచించారు. బుధవారం వడియంపేట, రెడ్డిపల్లి జగనన్న కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా స్పెషలాఫీసర్ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించాలని హౌసింగ్ సిబ్బందికి సూచించారు. ఎంపీడీఓ విజయ భాస్కర్, ఈఓఆర్డీ దామోదరమ్మ, హౌసింగ్ ఏఈ రాజశేఖర్ రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వరూప మహాసభ విజయవంతం చేయండి

తాడిపత్రి అర్బన్: ఎస్సీ వర్గీకరణ సాధన కోసం హైదరాబాద్‌లో ఆగస్టు రెండో వారంలో నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎంఎస్‌పీ(మాదిగ సంరక్షణ పార్టీ) అనంతపురం జిల్లా ఇన్‌చార్జ్ గుండాల ఈశ్వరయ్య కోరారు. బుధవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా గుండాల ఈశ్వరయ్య మట్లాడుతూ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని మాదిగలు విశ్వరూప మహాసభకు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. ఎంఎస్‌పీ నాయకులు పెద్దిరాజు మాదిగ, శివశంకర్, ఎమ్మార్పీఎస్ నాయకులు సీబీ రవి, రాజు, కంబగిరి, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించండి

గుత్తి రూరల్: సమస్యలను పరిష్కరించాలని వీఆర్ఏల సంఘం నాయకులు కోరారు. బుధవారం పట్టణంలోని స్థానిక కార్యాలయంలో తహసీల్దార్ మహబూబ్‌బాషాకు వీఆర్ఓలు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మండల వీఆర్ఏల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చిరంజీవి, నారాయణస్వామి మాట్లాడుతూ వీఆర్ఏలకు పేస్కేల్ అమలు చేయాలన్నారు. 60 ఏళ్ల పైబడిన ప్రతి వీఆర్ఏ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. నాయకులు జగదీష్, రామ్‌ప్రసాద్, సుధాకర్‌బాబు, యుగంధర్, రమణ, సుధాకర్ పాల్గొన్నారు.